బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తున్న ఇండియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

ఇండియన్ బ్యాంక్ 'డోర్ టు డోర్ క్యాంపెయిన్'

ప్రజాశక్తి-హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ తన పథకాలను క్యాంపెయిన్ చేయడానికి సరికొత్త ఆలోచన చేసింది. ఆ బ్యాంక్ సిబ్బంది హైదరాబాద్‌లో మంగళవారం వేకువ జామునే 'డోర్ టు డోర్ క్యాంపెయిన్'ను చేపట్టారు. ఇండియన్ బ్యాంక్ అందిస్తున్న 'ఇండ్ శక్తి 555 డేస్' ప్లాన్ సహా డిజిటల్ ఉత్పత్తులు, కరెంట్, సేవింగ్ ఎకౌంట్లు, రిటైల్ రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్ నేతృత్వంలో జరిగిన ఈ క్యాంపెయిన్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, ఇతర ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

- సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామంటూ గతేడాది మార్చి తొమ్మిదిన సిఎం కెసిఆర్ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. 80,039 ఖాళీ పోస్టులను కొత్త నియామకాల ద్వారా భర్తీ చేస్తామన్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులు రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసి సిఎం ఆమోదం కోసం దస్త్రాన్ని అధికారులు సమర్పించారని పేర్కొన్నారు. 11,103 మంది ప్రధానంగా మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నారని వివరించారు. రెగ్యులరైజేషన్ ఉత్తర్వుల కోసం వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. రెగ్యులరైజేషన్ ఆలస్యం కావడం ప్రభుత్వానికి మంచిది కాదని పేర్కొన్నారు. రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలంటూ అధికారులను ఆదేశించాలని కోరారు.

పిహెచ్‌డి సమర్పణకు గడువు పెంచాలి

- ఓయు పిహెచ్‌డి విద్యార్థుల ఫోరమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోవిడ్-19 సమయానికి మినహాయింపునిస్తూ పీహెచ్‌డీ పూర్తి చేసి సమర్పించేందుకు రెండేళ్ల సమయాన్ని పొడిగించాలని ఓయూ పీహెచ్‌డీ విద్యార్థుల ఫోరమ్ డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఫోరం కన్వీనర్ సీహెచ్.మురళీ, కో కన్వీనర్ కనకారెడ్డి, సభ్యులు మల్లేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వన్‌టైమ్ పేరుతో పీహెచ్‌డీ అడ్మిషన్ లేని వారికి కూడా పట్టాలిచ్చి అవినీతికి పాల్పడిన ఓయూ వీసీపై విచారణ చేపట్టి విద్యావ్యవస్థను కాపాడాలని కోరారు. ఆయన చేసే అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాసిరకం, దొంగ పీహెచ్‌డీలపై యూజీసీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. దేశంలో ఏ యూనివర్సిటీలో లేని విధంగా ఓయూ 26 మంది సీనియర్ ప్రొఫెసర్లని యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు కల్పించారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ప్రీ-పీహెచ్‌డీ పూర్తయ్యాక డిపాట్‌మెంట్ రీసెర్చ్ కమిటీ (డీఆర్‌సీ) అనుమతితో ఎన్ని సంవత్సరాల్లోనైనా పరిశోధన గ్రంథం (థీసీస్) సమర్పించుకోవడానికి వీలుందని తెలిపారు. కరోనా సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ దాదాపు రెండేండ్లు మూసేశారనీ, ఆ సమయంలో ల్యాబ్‌లు, లైబ్రరీలు సైతం మూతపడ్డాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కోవిడ్ సమయాన్ని రెండేండ్లు పొడిగించాలంటూ యూజీసీ చెప్పినా వినకుండా ఆరు నెలల్లో పూర్తి చేయకపోతే పీహెచ్‌డీలు రద్దవుతాయంటూ ఆదేశాలిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపిని అడ్డుకునే దమ్ము కమ్యూనిస్టులది..

- 18న ఖమ్మం సభకు కేరళ ముఖ్యమంత్రి హాజరు
- రాష్ట్రంలో బిఆర్ఎస్‌తో కలిసి పని చేస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో అధికారంలోకి రావాలని ఆశ పడుతున్న బిజెపి ఆశలను అడియాసలు చేసే దమ్ము కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి కలలను కల్లలు చేసే సత్తా కమ్యూనిస్టులకే ఉందని చెప్పారు. అది ఇటీవల జరిగిన మునుగోడు ఉపఎన్నికల్లో స్పష్టమైందన్నారు. అదే పద్ధతిలో రాష్ట్రం మొత్తంగా బిజెపిని అడ్డుకుంటామన్నారు. ఈ నెల 18న ఖమ్మంలో బీఆర్ఎస్ తలపెట్టిన బహిరంగసభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరవుతున్నారని తెలిపారు. బిజెపి మతోన్మాద విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు భవిష్యత్‌లోనూ బిఆర్ఎస్‌తో కలిసి పని చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి ఎలాంటి నిధులూ కేటాయించకుండా వివక్ష చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి నిధులు కేటాయించని బిజెపి నాయకులకు ఇక్కడి ప్రజల ఓట్లు అడిగే నైతిక అర్హత లేదన్నారు. రాష్ట్రంలో వామపక్షాలు బలంగా ఉన్న జిల్లాల్లో బిజెపి పాగా వేయాలని చూస్తుందని, అందుకోసం ఇతర పార్టీలో ఉన్న బలమైన నేతలను లాక్కునేందుకు ప్రలోభాలకు గురిచేస్తోందని విమర్శించారు. బిజెపి మతోన్మాద విధానాలను తిప్పికొట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సెమినార్‌లు, సదస్సులు, బహిరంగ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే పొత్తుల గురించి ఆలోచిస్తామని స్పష్టం చేశారు. బిజెపిని ఎదుర్కొనేందుకు సిపిఐ, సిపిఎం కలిసి ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడుతాయన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో 35 డెలివరీలు..

జనగామ ఎంసిహెచ్ రాష్ట్ర స్థాయి రికార్డు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లా ఎంసిహెచ్ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఒకే రోజు 35 డెలివరీలు చేసి రాష్ట్రస్థాయిలో రికార్డు నెలకొల్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు డాక్టర్లు, వైద్య సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 24 గంటల్లో 35 డెలివరీలు జరగడం రాష్ట్రంలోనే ప్రథమమన్నారు. మొదటి కాన్పు వారు తొమ్మిమందికి నార్మల్ డెలివరీ, ఆరుగురుకి ఆపరేషన్ చేశామని తెలిపారు. 22 మందికి ఇంతకుముందు ఆపరేషన్ అయిన వారికి ఆపరేషన్ చేశారని తెలిపారు. ఇందులో 20 మంది మగ పిల్లలు, 15 మంది ఆడపిల్లలతోపాటు తల్లులూ ఆరోగ్యంగా ఉన్నట్టు చెప్పారు. కొత్తగా జాయినయిన డాక్టర్ శోభ, డాక్టర్ మనస్విని ఇద్దరు కలిసి ఆస్పత్రిని రాష్ట్రంలో ఉన్నత స్థానంలో నిలిపారని కొనియాడారు. సిస్టర్ మరియమ్మ, సిస్టర్ సంగీత, మేడ్ వైఫరీ సిస్టర్, సపోర్టింగ్ స్టాఫ్ అందరికీ అభినందనలు తెలిపారు.

డెలివరీ అయిన వారితో ఆస్పత్రి డాక్టర్లు

జనగామ ఆస్పత్రి సిబ్బందికి అభినందనలు : మంత్రి హరీశ్ రావు

జనగామ మాతా, శిశు ఆస్పత్రి సిబ్బందికి వైద్యారోగ్యశాఖ మంత్రి టి హరీశ్ రావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. ఒకే రోజు 35 మందికి ప్రసవాలు చేసి తమ సేవను చాటుకోవడం అక్కడి డాక్టర్లు, సిబ్బందికి ఉన్న నిబద్ధతకు, అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.

గజగజ వణికిస్తున్న చలి

- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరీ ఎక్కువ
- సిర్పూర్(యు)లో 5.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత
- మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలను చలి గజగజ వణికిస్తోంది. రాష్ట్రంలో మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలితీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉంది. మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో చల్లని గాలులు వీచే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో ఉదయం పూట పొగమంచు ఏర్పడే అవకాశముంది. రాష్ట్రం మీదుగా తూర్పు, ఈశాన్య దిశల నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టిఎస్‌డిపిఎస్) నివేదిక ప్రకారం మంగళవారం కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 5.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో 23 జిల్లాల్లో (కొమ్రంభీమ్ అసిఫాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నిర్మల్, మెదక్, రాజన్నసిరిసిల్ల, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, ములుగు, జోగులాంబ గద్వాల, మంచిర్యాల, నల్లగొండ, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్) చాలా ప్రాంతాల్లో పది డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. బుధవారం నాడూ 15కుపైగా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీలలోపే నమోదయ్యే అవకాశం ఉందని టిఎస్‌డిపిఎస్ తన వెదర్ రిపోర్టులో పేర్కొంది.

మతోన్మాదులపై చర్యలు తీసుకోండి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్
- సమాజం రక్షణగా నిలవాలి : సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోటగిరిలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషించి, వేధించిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బాధిత ఉపాధ్యాయుడిని పరామర్శించి మాట్లాడారు. కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దళిత సామాజిక తరగతికి చెందిన ఉపాధ్యాయుడిని బలవంతంగా మెడలు పట్టి బడి నుంచి గుడి వద్దకు లాక్కెళ్లి జై శ్రీరాం అనిపించారని, ఒత్తిడి చేసి బొట్టుపెట్టి ఆయన మనోభావాలు దెబ్బతీశారన్నారు. 2022 సెప్టెంబర్‌లో వినాయక చందా ఇవ్వనందుకు నాటి నుంచి కక్షపెంచుకొని జనవరి 2న ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిపారు. కులం పేరుతో దూషించి తీవ్రమైన పరుష పదజాలంతో హేళన చేశారని అన్నారు. ఒక టీచర్ సైన్స్ హేతువాదాన్ని మాత్రమే బోధిస్తాడని, మూఢత్వాలు ఎందుకు బోధిస్తాడని ప్రశ్నించారు? సైన్స్ బోధించడం నేరం కాదన్నారు. ఉపాధ్యాయుడిని అవమానించిన దుండగులను ప్రభుత్వం అరెస్ట్ చేయడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. దౌర్జన్యం చేసిన మతోన్మాద దుండగులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం నమోదు చేయాలని, ప్రభుత్వ విధులకు ఆటంకపర్చినందుకు కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయనకు ప్రాణభయం ఉందని, ఆయన కుటుంబానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే కెవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని సామాజిక ప్రజాసంఘాలను కలుపుకొని ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం టీచర్ మల్లిఖార్జున్‌ను పూలదండ, శాలువతో ఘనంగా సన్మానించారు. పరామర్శిన వారిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్యాల సుమన్, కొండ గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు డి. శంకర్, భాస్కర్, రైతుసంఘం నాయకులు భాస్కర్, సీఐటీయూ వ్యవసాయ కార్మికసంఘాల జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధరప్ప, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌కు సమాజం అండగా నిలవాలి : సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య

మల్లికార్జున్‌ను కొంతమంది ఉద్దేశపూర్వకంగా మతం పేరుతో అవమానపరచడం సహించలేనిదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. మతోన్మాదుల చేతిలో అవమానాల పాలైన ఉపాధ్యాయుడికి సమాజం అండగా నిలవాలని కోరారు. మంగళవారం ఆయన బోధన్ పట్టణంలోని బాధిత ఉపాధ్యాయ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. టీచర్‌ను బెదిరించి అవమానపరిచిన వారిపై వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున్ కుటుంబానికి సిఐటియు తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసానిచ్చారు. ఆయన వెంట కార్యదర్శులు శ్రీకాంత్, రమేష్, జిల్లా సీఐటీయూ కార్యదర్శి నూర్జహాన్, అధ్యక్షులు శంకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఎంజిఎం సూపరింటెండెంట్ ఛాంబర్ ఎదుట మౌనదీక్ష చేస్తున్న కార్మికులు

తొలగించిన ఔట్‌సోర్సింగ్ కార్మికులను..

విధుల్లోకి తీసుకోవాలని..

- ఎంజిఎం ఉద్యోగుల మౌన దీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగులకు ఇచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్లు మరుసటి రోజు నుంచే చెల్లుబాటు కావని చెప్పి తమ కుటుంబాలను రోడ్డు పాలు చేశారని కార్మికులు ఆరోపించారు. ఈ సమస్యపై మంగళవారం వరంగల్ ఎంజిఎం సూపరింటెండెంట్ ఛాంబర్ ఎదుట 16మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులు మౌన దీక్ష చేపట్టారు. వీరిని ఉద్యోగాల్లోకి తీసుకున్నాక కలెక్టర్ నియామకాలను ఆపి వేయమని చెప్పారంటూ విధుల నుంచి తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకూ నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడల రమేష్ యాదవ్, బాధితులు పాల్గొన్నారు.

డిసెంబర్ వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఆవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 2022 డిసెంబర్ నెల జీతాన్ని వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వెంకటేశ్, జె కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కార్పొరేషన్లు, యూనివర్సిటీలు, హెల్త్, రెవెన్యూ తదితర 36 శాఖల్లో లక్షా నలభై వేల మంది కాంట్రాక్టు, ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి పదో తేదీ దాటినా ఇంకా వేతనం చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రతినెలా 15వ తేదీ వరకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ట్రైబల్ వెల్ఫేర్‌లోని సిబ్బంది జీతాలూ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2022 డిసెంబర్ నెల వేతనం చెల్లించడమే కాకుండా జనవరి నెల నుంచి ఈ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. ఇదే అంశాన్ని జె వెంకటేశ్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ యూనియన్ రాష్ట్ర నేత బి మధు ఆర్థిక శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

దేశ వైవిధ్య ప్రదర్శనకు జీ20 మంచి అవకాశం

- గవర్నర్ తమిళిసై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచం ఎదుట మన దేశ వైవిధ్యతను ప్రదర్శించేందుకు జీ-20 ప్రెసిడెన్సీ మంచి అవకాశమని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. మంగళవారం రాజ్ భవన్‌లో నిర్వహించిన ఇండియాస్ జీ20 ప్రెసిడెన్సీ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు ఆమె అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశాన్ని లోతుగా అర్థం చేసుకునేలా పోటీల్లో పాల్గొన్న భాగస్వాములు ఆసక్తి చూపించారని అభినందించారు. జీ20 అంశం వసుధైక కుటుంబం, ఈ విషయంలో భారతదేశానికి పురాతన కాలం నుంచి అనుభవముందని తెలిపారు. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తంటూ ఆమె గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న ప్రపంచ అగ్రగామి నాయకత్వంలోకి భారత్ ప్రవేశిస్తున్నదని చెప్పారు. లక్ష్యాలను చేరుకోవడంలో ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులకు భయపడొద్దంటూ ఆమె విద్యార్థులకు సూచించారు. వారిలో ఆత్మవిశ్వాసం పెరిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమదైన ప్రత్యేక ప్రతిభతో జన్మిస్తారనీ, వారిలోని ప్రతిభను ఎవరికి వారు గుర్తించేలా ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని ఆమె గుర్తుచేశారు. అనంతరం ఆమె వ్యక్తృత్వం, వ్యాసరచన, పోస్టర్ పోటీల్లో విజేతలకు పురస్కారాలను, బహుమానాలను అందజేశారు. రాష్ట్రంలోని ఆయా యూనివర్సిటీల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, ఉస్మానియా యూనివర్సిటీ బోధనా సిబ్బంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాజ్ భవన్ సీనియర్ ఉన్నతాధికారులు, యూనివర్సిటీల బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఎందుకు పంపిణీ చేయలేదు?

- సిఎం కెసిఆర్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పండుగపూట ఇప్పటిదాకా పేదలకు రేషన్ బియ్యం ఎందుకు పంపిణీ చేయలేదో చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం బహిరంగ లేఖ రాశారు. కరోనా కాలంలోనూ గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద కేంద్రం ఇచ్చిన బియ్యాన్నీ పేదలకు అందకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని విమర్శించారు. ఎఫ్‌సిఐ కోసం కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని మొత్తం ఫోర్టిఫైడ్ రైస్‌గా ఇచ్చి విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు కేంద్రం చేస్తున్న కృషిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పదో తేదీ వచ్చినా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జీతాలివ్వకపోవడం, పెన్షనర్ల సొమ్మును ఖాతాల్లో జమచేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగకు పెండింగ్‌లోని నాలుగు డిఎలు చెల్లిస్తారని ఆశిస్తే కనీసం జీతాలు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ తక్షణమే జీతాలతోపాటు పెన్షనర్లకు పెన్షన్ సొమ్మును విడుదల చేయాలని కోరారు.

విచ్ఛిన్నకర శక్తులను తిప్పికొడతాం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- అఖిల భారత మహాసభ నేపథ్యంలో సిఐటియు జెండా ఎగురవేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాభివృద్ధికి ఆటంకంగా మారిన విచ్ఛిన్నకరశక్తుల ఎత్తుగడలను తిప్పికొడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాల కోసం కొట్లాడుతామన్నారు. హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ యూనియన్ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని మంగళవారం అరుణపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఐటియు అఖిల భారత మహాసభ బెంగుళూరులో ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగబోతోందని, దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మతోన్మాద శక్తులు, కార్పొరేట్ శక్తులు దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు కార్మికులను రాజకీయంగా చైతన్యపరిచి పోరాటాలు చేస్తామన్నారు. దేశంలో శాంతిని నెలకొల్పేందుకు కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ముందుకు సాగుతామని చెప్పారు. సమాజమార్పు, దోపిడీ అంతానికి సిఐటియు ఎల్లవేళలా కృషి చేస్తోందని తెలిపారు. ఏప్రిల్ ఐదో తేదీన కార్మికులు-వ్యవసాయ కూలీలు-రైతులు సంయుక్తంగా తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, రాష్ట్ర కార్యదర్శి మధు, వర్కింగ్ కమిటీ సభ్యులు ఆర్ కోటంరాజు, కె సోమన్న, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఎ సునీత తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదు

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి అరెస్టులపై ఉన్న శ్రద్ధ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కారంపై లేకపోవడం విచారకరమని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి, పలు విద్యార్థి సంఘాలు విమర్శించాయి. సోమవారం చలో ప్రగతిభవన్‌కు తరలివస్తున్న యువజన, విద్యార్థి సంఘాల నేతలు, పోలీసు అభ్యర్థులను అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం, దాడులు చేయడాన్ని ఖండించాయి. అక్రమ అరెస్టులను నిరసిస్తూ.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం హైదరాబాద్ నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద పలు విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా పోరాట సమితి కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర, నేర్లకంటి శ్రీకాంత్, సత్యప్రసాద్ (ఎఐవైఎఫ్), అనగంటి వెంకటేష్, జావీద్ (డివైఎఫ్ఐ), సలీం పాషా(వైజెఎస్), అశోక్ రెడ్డి, సునీల్ (ఎస్ఎఫ్ఐ), అరుణ్ కుమార్(విజెఎస్) రాష్ట్ర బాధ్యులు మాట్లాడారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వల్ల ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. బోర్డ్ చైర్మెన్ రోజువారీ ప్రకటనలు ఆపాలని, అభ్యర్థుల వాదనను బోర్డు పరిగణలోకి తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

హైదరాబాద్‌లో భారీగా పెరిగిన ఆఫీసు లీజింగ్

- నైట్‌ఫ్రాంక్ వెల్లడి

హైదరాబాద్ : నగరంలో వాణిజ్య అవసరాల ఆఫీసు లీజింగ్ భారీగా పెరిగిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ తెలిపింది. గతేడాది 2022లో హైదరాబాద్‌లో ఆఫీసు లీజింగ్ 67 లక్షల చదరపు అడుగులుగా చోటు చేసుకుందని వెల్లడించింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 12 శాతం వృద్ధితో 10 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరిందని పేర్కొంది. దేశంలోని ఎనిమిది టాప్ మార్కెట్లలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచిందని పేర్కొంది. ఈ డిమాండ్‌కు కారణం ఇన్ఫర్మేషన్ టెక్నలాజీ రంగమే ప్రధాన కారణమని పేర్కొంది. కాగా.. 2022 ద్వితీయార్థంలో ఐటి రంగం విస్తరణ ప్రణాళికలు స్తంభించాయని తెలిపింది. దశాబ్దం క్రితం నగరంలో 1.12 కోట్ల చదరపు అడుగుల ఆఫీసు లీజింగ్ చోటు చేసుకోగా.. ఆ తర్వాత గతేడాది మాత్రమే భారీ స్థాయిలో డిమాండ్ చోటు చేసుకుందని పేర్కొంది.

పదో తరగతి విద్యార్థులకు ఛాయిస్ పెంచాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు సంబంధించి మరింత ఛాయిస్ ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వ్యాసరూప ప్రశ్నల్లో సెక్షన్ల వారీగా ఛాయిస్ ఇవ్వాలని కోరింది. ఈ పరీక్షలు రోజు విడిచి రోజు నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణను మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు లెనిన్‌గువేరా కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు సూక్ష్మ ప్రశ్నలకు 30 శాతం ఛాయిస్ పెంచాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వ్యాసరూప ప్రశ్నలకు సెక్షన్ల వారీగా ఛాయిస్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుత పదో తరగతి విద్యార్థులు కరోనా కారణంగా అభ్యసనకు సరైన పరిస్థితుల్లేవనీ, ఇలాంటి తరుణంలో ఈ విధానంలో ఛాయిస్ లేకుండా పరీక్షలు నిర్వహిస్తే సిలబస్ మొత్తం పరీక్షలు రాయడానికి సమయం సరిపోదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఛాయిస్ ఇచ్చి విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో బిజెపికి చుక్కలు చూపిస్తాం

- సెస్ ఎన్నికల ఫలితం ట్రైలర్ మాత్రమే..
- పెట్రో డీజిల్, సిలిండర్ ధరలు పెంచిన మోడీ.. దేవుడా?
- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"పెట్రో డీజిల్, సిలిండర్ సహా అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెంచిన మోడీ.. ప్రజలకు దేవుడెలా అవుతారు? ఆయన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌కి, గుజరాత్ ప్రజలకు మాత్రమే దేవుడవుతారు. కర్ణాటక, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బిజెపి ఆ రాష్ట్రాల మధ్య గెట్టు పంచాయితీ తేల్చలేకపోతోంది. అలాంటి పార్టీ నేత మోడీ రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపాడని చెప్పటం సిగ్గుచేటు.. సిరిసిల్ల సెస్ ఎన్నికలు ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందు చూపిస్తాం" అని ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ (సెస్) పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో మంగళవారం మంత్రి పాల్గొని మాట్లాడారు.

సెస్ ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

తెలంగాణకు కేంద్రం నిధుల విషయంలో బిజెపి నేతలకు కెటిఆర్ మళ్లీ సవాల్ విసిరారు. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.3.68 లక్షల కోట్లు వెళ్లాయని, కేంద్రం మాత్రం తెలంగాణకు రూ. రెండు లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఈ విషయంలో తాను చెప్పింది తప్పని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. గుజరాత్‌లో దోచుకున్న సంపదను బిజెపి నేతలు సెస్ ఎన్నికల్లో ఖర్చు చేశారని విమర్శించారు. '24వ తేదీ సెస్ ఎన్నికలు.. మాకు 22, 23 తేదీల్లో ఫోన్లు వచ్చాయి. బండి సంజయ్ ఇక్కడికి వచ్చిర్రు. మండలానికి రూ.30 లక్షలకుపైగానే పంచిర్రు. సంజయ్ రూ.4.5 కోట్లు పంచినా రైతాంగం, ప్రజల్లో బిఆర్ఎస్‌పై నమ్మకం ఉందని, మన పాలన పట్ల ఆదరణ చూపిస్తారని మా వాళ్లకు చెప్పిన' అన్నారు. బిఆర్ఎస్ పట్ల ప్రజల ఆదరణ ఫలితాల్లో తేలిందన్నారు. ఇన్ని కోట్లు పంచినా బిజెపి కనీసం ఒక్క డైరెక్టర్ స్థానమైనా గెలుచుకోలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఈ సెస్ ఎన్నికలు బిజెపికి తమ పార్టీ ట్రైలర్ మాత్రమేనని, 2023 ఎన్నికల్లో అసలు సినిమా చూపిస్తామని స్పష్టం చేశారు. బిజెపికి దమ్ముంటే అనవసర విమర్శలు ఆపి.. కనీసం కొన్ని మంచి పనులైనా చేసి చూపించాలని హితవు పలికారు.

సెస్ బకాయిలను రికవరీ చేయాలి

- లేబర్ కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎల్అండ్‌టి హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నుంచి రూ.163 కోట్ల సెస్ బకాయిలను వెంటనే రికవరీ చేయాలని, బడా నిర్మాణ సంస్థల నుంచి సెస్ వసూలు చేయాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం లేబర్ కమిషనర్‌కు సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, ఎం.దశరథ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. పత్రంలోని పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ మెట్రో రైలును నిర్మించి, నిర్వహిస్తున్న ఎల్అండ్‌టి సంస్థ కార్మిక శాఖకు చెల్లించాల్సిన రూ.163 కోట్ల లేబర్ సెస్‌ను ఎగవేసింది. 2014లోనే సెస్ చెల్లించాలని కార్మికశాఖ అధికారులు ఎల్అండ్‌టి సంస్థకు నోటీసులు జారీ చేసినా చెల్లించలేదు. సెస్ చెల్లింపు గురించి హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న ఎల్అండ్‌టి సంస్థకు కార్మికశాఖ అధికారులు వత్తాసు పలికారు. 2019 వరకు హైకోర్టులో కనీసం అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. సిపిఎం నగర కమిటీ ఫిర్యాదుతో ఇటీవల కోర్టులో కౌంటర్ వేసినప్పటికీ సెస్ వసూలుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎల్అండ్‌టి సంస్థకు మూడు వారాలే స్టే ఇచ్చినప్పటికీ స్టే ఉందన్న పేరుతో అధికారులు సెస్ వసూలుకు పూనుకోలేదు.

సెస్ చట్టం ప్రకారం ప్రతి బకాయిపైనా నెలకు రెండు శాతం చొప్పున వడ్డీ వసూలు చేయాల్సి ఉంటుంది. రూ.163 కోట్లకు వడ్డీతో కలిపి తక్షణమే ఎల్అండ్‌టి నుంచి రికవరీ చేయడానికి చర్యలు ప్రారంభించాలి. మెట్రోరైలు నిర్మాణానికి వ్యయం పెరగడంతో మొత్తం వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఒక శాతం చొప్పున సెస్ వసూలు చేయాలి. ఎల్అండ్‌టి సెస్ ఎగవేతకు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. విజిలెన్స్ శాఖ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అనేక బడా నిర్మాణ సంస్థలు 2014 నుంచి 2020 వరకు సెస్ చెల్లించలేదు. సెస్ వసూలు చేసే బాధ్యతా జిహెచ్ఎంసిదా? కార్మికశాఖదా? అనే వివాదంతో ఇంతవరకు వసూలు చేయలేదు. సిపిఎం చేసిన ఆందోళనతో 2020కి ముందు సెస్ చెల్లించని సంస్థలు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటన్నింటి నుంచి సెస్ వసూలుకు చర్యలు ప్రారంభించాలని పేర్కొన్నారు.

పేదల గుడిసెల కూల్చివేత అక్రమం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సైదాబాద్ లోకాయుక్త కాలనీలో ప్రభుత్వయేతర భూముల్లో ఐదు దశాబ్దాలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదల గుడిసెలను రెవెన్యూ అధికారులు కూల్చడం అక్రమమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ ఎస్‌బిహెచ్ కాలనీ, ఏ-వన్ కమ్యూనిటీ హాల్‌లో ఆశ్రయం పొందుతున్న బాధిత గుడిసెవాసులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.ఛాయాదేవి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్‌నాయక్‌తో కలిసి కూనంనేని సాంబశివరావు మంగళవారం పరామర్శించారు. తెల్లవారుజామున దౌర్జన్యంగా గుడిసెల్లోకి ప్రవేశించి మహిళలు, బాలింతలని చూడకుండా గెంటేసి గుడిసెలను అధికారులు కూల్చివేశారని బాధితులు కన్నీరుపెట్టుకున్నారు. 50 ఏండ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని ఇప్పటివరకు ఈ భూమి తమదని ఎవరూ రాలేదని తెలిపారు. కొందరు అధికారుల అండతో ఇప్పుడు ఈ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని వారంతా వాపోయారు.

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు అని రికార్డుల్లో లేనప్పుడు గుడిసెలను ఎలా కూల్చేస్తారని ప్రశ్నించారు. అధికారులు, భూకబ్జాదారులు కుమ్మక్కై, రౌడీల్లా వ్యవహరిస్తూ కాలనీల్లో ఉండే గుడిసెవాసులనే టార్గెట్ చేస్తూ, పేదల బతుకులను రోడ్డుకీడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల గుడిసెలను కూల్చివేసి నిస్సహాయులుగా మార్చితే ఉరుకునేది లేదని హెచ్చరించారు. గుడిసెలు కూల్చివేసిన స్థలంలోనే తిరిగి గుడిసెలు వేసుకోవాలని, బాధితులకు సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు ఇండ్ల పట్టాలు లేదా అక్కడే డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, సమితి సభ్యులు ఎస్.ఏ.మన్నన్, అమీనా తదితరులు ఉన్నారు.

రూ.25 కోట్లతో జినోమ్ వ్యాలీలో ఆర్అండ్‌డి

- మెటీయరిక్ బయో ఫార్మా వెల్లడి

ప్రజాశక్తి-హైదరాబాద్

రూ.25 కోట్లతో జినోమ్ వ్యాలీలో పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని మెటీయరిక్ బయో ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ గౌరవ్ కౌశిక్ వెల్లడించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2023 ముగింపు నాటికి ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అహ్మాదాబాద్‌లోని తన ఆర్అండ్‌డి సెంటర్‌ను ఇక్కడికి తరలించనున్నామని తెలిపారు. తొలుత 20-25 మంది సైంటిస్టులను తీసుకోనున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థకు 600 మంది క్లయింట్లున్నారన్నారు. 80 దేశాలకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. మెటీయిక్ బయోకు వందకు పైగా ఉత్పత్తులు, పదికి పైగా పేటెంట్లు, 50కు పైగా ట్రేడ్ మార్క్‌లున్నాయన్నారు. ఫార్మాకోవిజిలెన్స్, డాటా ఎనాలసిస్, వ్యాధులను ముందుగా గుర్తించడం, వ్యక్తిగతీకరించిన ఔషదాలు, ప్రత్యామ్నాయ ఔషదాలు, బయోటానికల్ ఎక్స్‌ట్రాక్ట్‌ను విస్తరించడంపై దృష్టి పెట్టామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.130 కోట్ల టర్నోవర్ సాధించామని.. ఈ ఏడాది రూ.180-200 కోట్ల టర్నోవర్ అంచనా వేస్తున్నామన్నారు.

తెలంగాణలో వచ్చేది బిజెపి డబుల్ ఇంజన్ సర్కారే..

- కేంద్ర నిధులు దారి మళ్లిస్తున్నారు
- కేంద్ర సహాయ మంత్రి బిఎల్ వర్మ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బిజెపి డబుల్ ఇంజన్ సర్కారు తెలంగాణలో వస్తుందని కేంద్ర సహాయ మంత్రి బిఎల్ వర్మ అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేయకుండా ఇబ్బంది పెడుతున్న తెలంగాణ ప్రభుత్వం రైతు విరోధి ప్రభుత్వమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించి కేంద్ర పథకాలను తమ పథకాలుగా చిత్రీకరించి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడటమే కాకుండా ఎదురు పెట్టుబడులు పెట్టి పనులు చేయించిన సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో బీజేపీలోకి భారీ చేరికలకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇక నుంచి బిజెపి కేంద్ర పార్టీకి తెలంగాణ పేరు ఎత్తగానే ఖమ్మం జిల్లా కనిపిస్తోందని, అటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చొరవ వల్లే ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు వచ్చాయని తెలిపారు.

నేడు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించడం కోసం బుధవారం బెంగుళూరులో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం నియమించబడ్డ జస్టిస్ సదాశివన్ కమిటీ నివేదికను ఆమోదించడంలోనూ, అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి నివేదించడంలో కర్నాటకలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడుతున్నదని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన జస్టీస్ ఉషా మెహ్రా కమిషన్ నివేదికను ఆమోదించడంలో, పార్లమెంట్ ద్వారా ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని దశాబ్దకాలంగా మాదిగలను నమ్మిస్తూ బిజెపి మోసం చేస్తున్నదని తెలిపారు.

సౌందర్య లహరి సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సౌందర్య లహరి జ్ఞాన ప్రదాయని

ప్రజాశక్తి - కల్చరల్

సౌందర్య లహరి సంపుటిలోని అలనాటి ప్రసిద్ధ పురుషుల మహర్షుల జీవిత విశేషాల మాలిక అవి జ్ఞాన ప్రదాయం అని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై వంశీ థియేటర్స్ శుభోదయం గ్రూప్ నిర్వహణలో భువనేశ్వరి మారేపల్లి రచించిన వంశీ స్వర్ణోత్సవ ప్రచురణ సౌందర్యలహరి సంపుటి అవిస్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని సంపుటి ని అవిష్కరించి మాట్లాడారు. సంపుటిలోని మహనీయుల విశేషాలు మానసిక పరిపక్వత కు మనో వికాసానికి దోహదపడతాయని అన్నారు. సంపుటిలో ప్రాచీన కాలంలో మహర్షులు కేవలం పురుషులే కాదని మహిళలు సర్వ శాస్త్ర పారంగతులు వున్నారని తెలిపారన్నారు. రచయిత్రి ఆదర్శనీయ సమాజం లక్ష్యంగా సౌందర్య లహరిని అందించారని అభినందించారు. అధ్యక్షత వహించిన సాహితీవేత్త డాక్టర్ వోలెటి పర్వతీశం మాట్లాడుతూ సంపుటి సులభ శైలిలో అసాంతం చదివించే విధంగా ఉందని తెలిపారు రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి, కవయిత్రి రాజ్యశ్రీలు సృజనాత్మక రచయిత్రి భువనేశ్వరి అని ప్రశంసించారు. రచయిత్రి భువనేశ్వరి తన సంపుటిని లాంఛనంగా తమ మాత మూర్తి ఆకెళ్ల సీతా మహాలక్ష్మి కి అంకితమిచ్చారు. వంశీ రామరాజు స్వాగతం పలికిన సభలో చరిత్ర పరిశోధకులు కావూరి శ్రీనివాస్, పలేశ్వర శాస్త్రి పాల్గొన్నారు

కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్

బిఒబి హిందీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-హైదరాబాద్

బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) తెలంగాణ సౌత్ రీజియన్ మంగళవారం ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఉస్మానియా యూనివర్శిటీలోని హిందీ డిపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ తెలంగాణ సౌత్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ కుమార్ గురజాపు పాల్గొని మాట్లాడారు. దీన్ని సీనియర్ మేనేజర్ ఒఎల్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ జి విజయ్ కుమార్ కో-ఆర్డినేట్ చేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా కోటపల్లి మండలంలోనీ ఎదులబంధం గ్రామంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలో విఅర్ఎగా విధులు నిర్వహిస్తున్న కుమ్మరి ధనుంజయ్ ఇంట్లో ఉదయం గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు కాలిపోయింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సామగ్రి, రూ.2.50 లక్షలు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటకీ అప్పటికే ఆస్తినష్టం జరిగింది. బాధిత కుటుంబాన్ని ఎంపిటిసి జేక శేకర్ పరామర్శించి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. జెడ్‌పి కోఆప్షన్ సభ్యుడు ఎండి హజ్గర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేల అర్థిక సాయం అందించారు. సర్పంచ్ కోటరి నిర్మల సైతం బాధితులను పరామర్శించారు.

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఖిల్లా

- పది అసెంబ్లీ, రెండు ఎంపి స్థానాలు మావే..
- గెలిపించి సోనియాకు కానుకగా ఇస్తాం..
- మత విద్వేషాలు రెచ్చగొట్టే బిజెపికి ఇక్కడ స్థానం లేదు..
- కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రేణుకా చౌదరి

ఖమ్మం జిల్లా నేటికీ కాంగ్రెస్ ఖిల్లా అని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ మరింత బలపడటం ఖాయమని, ప్రభుత్వ ఏర్పాటు చేస్తోందని దీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో సాక్షాత్తు కెసిఆర్ ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి దాదాపు రూ.36 కోట్లు ఓట్ల కోసం ఖర్చు పెట్టి, స్టార్ క్యాంపియన్లను పెట్టి ప్రచారాలు చేస్తే ఆ పార్టీకి వచ్చింది ఒక్క సీటేనని గుర్తు చేశారు. ఈ సారి కాంగ్రెస్ కార్యకర్తలు అంతా కసితో ఉన్నారని, కలిసికట్టుగా పనిచేయడం ద్వారా జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ పార్టీకి దక్కేలా కృషిచేసి సోనియా గాంధీకి కానుకగా ఇస్తామని చెప్పారు. ఖమ్మం పరిసరాల్లో కోతుల గుట్ట, కుక్కల గుట్టలు అనేవి ఉండేవని, ఇప్పుడు ఆయా గుట్టల మట్టి లక్షల రూపాయలకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అమ్ముకోవడం ద్వారా లోయలుగా మారాయని విమర్శించారు. మట్టి అమ్మకం అక్రమాలపై తాను ఫిర్యాదు చేయబోతున్నట్టు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెబుతోందని, చేసిన అభివృద్ధిలో అక్రమాలు డొల్లతనం తప్ప గట్టితనం లేదన్నారు. ఖమ్మం ఆర్‌టిసి నూతన బస్టాండ్ 20 కోట్లు ఖర్చుపెట్టి గొప్పగా కట్టినట్టు చెబుతున్నప్పటికీ వర్షం వస్తే వాటర్‌ఫాల్ మాదిరిగా మారిపోతుందని, లోపాలను వీడియో తీసి ప్రజల ముందు ఉంచితే ఆ వీడియో తీసిన వ్యక్తిని జైల్లో వేశారని ఆరోపించారు.

తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు పాలేరు నుంచి పర్ణశాల వరకు టూరిజం అభివృద్ధి జరిగిందని, ఖమ్మం జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, నిర్మాణంతో పాటు కేంద్ర విద్యాలయాలు నవోదయ పాఠశాలలు తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలు తన హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. ఇప్పుడు జరుగుతున్నదంతా అభివృద్ధిమాటున అవినీతి తప్ప ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు గెలిపించి ప్రజాప్రతినిధులుగా అసెంబ్లీకి పంపిస్తే కొంతమంది సంతలో గొర్రెల్లాగా అమ్ముడుపోయారని, అటువంటి వారిపట్ల కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి హిందువుల ఓట్లు పొందాలని, చూసే బిజెపికి ఇక్కడ స్థానం లేదని తెలిపారు. బిజెపి పాలనలో ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కనీస స్థాయి ఓట్లయినా లేని బిజెపి ఇక్కడేదో చేయబోతున్నామంటే నమ్మవలసిన అవసరం లేదని అన్నారు. తొలుత ఖమ్మం వచ్చిన ఆమె తన క్యాంపు కార్యాయాలన్ని తిరిగి ప్రారంభించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పిసిసి అధికార ప్రతినిధి ఎడవల్లి కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మానుకొండ రాధా కిషోర్, నగర కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే నా రాజకీయ గాడ్ ఫాదర్..

- నన్ను టార్గెట్ చేసేందుకు నలుగురు సిఎంలతో బహిరంగ సభ
- పోడు భూముల సమస్యను పరిష్కరించలేదు
- ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఎవరి అండా లేకుండా రాజకీయాల్లో స్వయం శక్తితో ఎదిగానని, ప్రజలే నా రాజకీయ గాడ్ ఫాదర్ అని ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు మండలం తోగ్గూడెం పంచాయతీ సమ్మక్క సారక్క ఆలయ ప్రాంగణంలో మంగళవారం డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అధ్యక్షతన పినపాక నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి పొంగులేటి హాజరై మాట్లాడారు. నాలుగేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా మౌనంగా భరించానని తెలిపారు. పదవి లేకున్నా ప్రజల్లో ఉంటూ సాయం చేస్తూనే ఉంటానని స్పష్టంచేశారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలిపారు. సంక్రాంతి పండుగలో వచ్చే గంగిరెద్దును కాదని, మౌనం అంగీకారం అనుకుంటే సరికాదని, మనసులో ఎన్నో బాధలు, గాయాలు ఉంటాయని, ప్రేమా, గౌరవం లేని చోట తాను ఇమడలేనన్నారు. సెక్యూరిటీలను తీసేసినా నొచ్చుకోలేదని, ప్రజలే తనకు సెక్యూరిటీ అని తెలిపారు. కష్టపడి సంపాదించిన ధనాన్ని ఇన్‌కమ్ టాక్స్ కట్టిన తర్వాత మిగిలిన దాన్ని ప్రజలకు పంచుతున్నా నన్నారు. రాబోయే కాలంలో ప్రజా తీర్పును గౌరవిస్తానన్నారు.

నాలుగేండ్లలో పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపులేకపోయారని అన్నారు. ప్రజలను పాలకులు చిత్రహింసలు పెడుతున్నారని, తిరిగి వడ్డీతో చెల్లించాల్సి వస్తోందని పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎన్నికల కోసం రాలేదని చెప్పారు. రాష్ట్రంలో ఎన్ని రూ. వేల కోట్ల పనులు చేశానో, ఎంత సంపాదించానో త్వరలోనే ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. రాష్ట్రం ఏర్పడకముందే పదిమంది కాంట్రాక్టర్లల్లో తానూ ఒక ప్రముఖ కాంట్రాక్టర్ అని, రాజకీయాల్లోకి వచ్చి కాంట్రాక్టర్‌ని కాలేదన్నారు. నన్ను టార్గెట్ చేసేందుకు ఖమ్మంలో నలుగురు ముఖ్యమంత్రితో బహిరంగ సభ పెడుతున్నారని అన్నారు. ఇబ్బందులు పెట్టినా, ఆర్థికంగా నష్టపోయినా ప్రజల వద్దకు జోల పట్టుకొని అడుక్కుంటూ రాజకీయం చేస్తానన్నారు. నాలుగేండ్ల కాలంలో కెసిఆర్ తనది తండ్రి కొడుకుల బంధంగా భావించానని, కానీ అటువైపు నుంచి ఏమీ దక్కకపోవడంతో రాజకీయ నిర్ణయం తీసుకుంటున్నానని తెలిపారు.

పినపాక మాజీ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తన హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. రూ.400 కోట్లు తానే తెచ్చానని, వాటికి శంకుస్థాపన చేస్తూ ప్రస్తుత ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని చెప్పారు. భూ కబ్జాలు, భూదందాలు, ఇసుక మాఫియా చేస్తూ కార్ల మీద కార్లు కొంటూ దోచుకుని దాచుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో జాలే ఆదినారాయణ, మువ్వ విజయబాబు, ముత్తినేని సుజాత, కెవి రావు, పుచ్చకాయల శంకర్, బల్లెం సురేష్, ఎస్కే బాజీ, నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని 117 పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో పొంగులేటి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం జిహెచ్ఎంసి కార్యాలయంలో 67 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. డిసెంబర్ 25న రాంనగర్ ఎంసిహెచ్ కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 'మెగా మెడికల్ క్యాంప్'లో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలు తయారు చేయించి, ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా టిఎస్ఆర్‌టిసి సీనియర్ ఆఫీసర్ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా ఉదాత్తమైన కార్యక్రమమని, హైదరాబాద్ జిందాబాద్ కృషిని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించినందుకు సంతోషంగా ఉన్నదని, ప్రతి ఒక్కరూ తమ వరకే కాక సమాజం కోసం ఆలోచించాలని, సాటి మనిషి కోసం ఏదో ఒకటి చేయాలని ఉద్బోధించారు. ఈస్ట్ ఎంసెట్ కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ. తమ కాలనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచిత కండ్లద్దాలు పంపిణీ చేసిన హైదరాబాద్ జిందాబాద్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. సినీ నిర్మాత శివనారాయణ వాసిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరై కండ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ ముషీరాబాద్ డివిజన్ నాయకులు రాజమౌళి, శ్రీవల్లి, నగర ప్రధానకార్యదర్శి కె వీరయ్య, సంయుక్త కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, పి నాగేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

సీత వక్కలంక, నిత్య కాశీభట్ల భరతనాట్య ప్రదర్శన

ప్రజాశక్తి - కల్చరల్

వంశీ ఆర్ట్ థియేటర్స్, శుభోదయం గ్రూప్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వంశీ స్వర్ణోత్సవాల సందర్భంగా సుజాతా శ్రీని టీవీవాసన్ (అమెరికా) శిష్యురాలు సీతా వక్కలంక (అమెరికా), నిత్య కాశీభట్ల (అమెరికా) 2023 జనవరి 12వ తేదీ సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలో భరతనాట్యం ప్రదర్శించనున్నారు. ఆ సందర్భంగా వారికి వంశీ-శుభోదయం గ్లోబల్ యూత్ అవార్డు బహూకరించడం జరుగుతుందని వంశీ వ్యవస్థాపకులు శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆరుగురు నాట్యగురువులకు వంశీ-శుభోదయం గ్లోబల్ అవార్డ్స్ బహూకరిస్తారు. పద్మశ్రీ బి పద్మజారెడ్డి, కళారత్న ఓలేటి రంగమణి, కళారత్న ఎస్‌పి భారతి, డాక్టర్ పి రమాదేవి, డాక్టర్ వనజ ఉదయ్, సుజాత వింజమూరి అవార్డులు అందుకోనున్నారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ శారదాపూర్ణ శొంఠి, సభాధ్యక్షులుగా డాక్టర్ ఓలేటి పార్వతీశం, విశిష్ట అతిథిగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ కలపటపు పాల్గొంటారు.